45.

# దీపావళి - అంతరార్థము

"అజ్ఞానాంధకారమనెడి చీకటిని పారద్రోలి సుజ్ఞానమనెడి ఆత్మజ్యోతిని హృదయమునందు వెలిగించండి"

పరమపావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నిటను వన్నె గాంచిన యట్టి
ఘనసత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మనదేశమందన్న
మాతృభావము కంటె మాన్యమెద్ది
ప్రాణంబు కంటెను మానంబె ఘనమను
మనదేశ నీతిని మంట గలిపి
నేటికిచ్చిరి పరదేశనీతులరసి
వెనవిచిత్ర స్వేచ్ఛయనువిచ్చుకత్తి
ఔరా! ఏమందు భారత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెరుగలేదో
అట్టులైనారు ఈ భారతీయులు నేడు

ప్రదోషే దీపకశ్చంద్రః ప్రభాతే దీపకోరవిః
త్రైలోక్యే దీపకో ధర్మః సుపుత్రః కులదీపకః

రాత్రులయందు చంద్రుడుదయించి చీకటిని దూరము చేసి మానవునకు దారిని చూపుతున్నాడు. పగటివేళలయందు సూర్యుడు ప్రకాశిస్తూ దారిని చూపిస్తూ మానవునకు అత్యంత ఆనందము చేకూరుస్తున్నాడు. త్రికాలములకు, త్రిలోకము లకు ధర్మమే దీపమై నిల్చి సర్వులకు మార్గదర్శకులై ఉంటున్నది. సుపుత్రుడు కులమునకే వెలుగుగా ఉంటాడు.

srisathyasaivachanamrutam

ప్రేమస్వరూపులారా! భారతీయ పర్వదినములన్నీ కూడను అత్యంత దైవీక అర్థముతో కూడినవే. మానవత్వములోనున్న దివ్యత్వాన్ని నిరూపించే నిమిత్తమై భారతదేశమునందు అనేక పర్వదినములు చేకూరుతూ వచ్చాయి. ఈనాడు దీపావళి అని ఒక పవిత్ర అర్థముతో కూడిన, ఆదర్శముతో కూడిన మానవాళికి కొన్ని బోధలు సల్పునటువంటిది ఈ దీపావళి. దీపమునకున్న విశిష్టత, ఈ ప్రపంచములో ఏ పదార్థమునకు లేదు. దీపము అంధకారమును దూరముచేసి మార్గమును నిరూపిస్తుంది. ఈ ప్రకాశముచేతనే మానవుడు తన నిత్య జీవితములో ఒకవిధమైన కార్య కర్మలలో ప్రవేశిస్తుంటాడు. అంధకారమును దూరము చేసే తత్త్వమే ఈ దీపమునకు విశిష్టమైన శక్తి. దీనికి రెండవశక్తి కూడా ఉన్నది. దీపము ఏ ప్రదేశమునందుంచినా జ్వాల ఊర్ధ్వగతిని నిరూపిస్తుంది. ఒక గుంతలో దీపము పెట్టినప్పటికి దాని ప్రకాశవంతమైన జ్వాలలు ఊర్ధ్వగతికే ప్రయాణమవుతుంటాయి. ఇది అధోగతికి ఏమాత్రం జొరబడదు. ఈ ఊర్ధ్వగతియే దివ్యమైన జ్ఞానమార్గమని, దైవమార్గమని ప్రాచీనులు బోధిస్తూ వచ్చారు. ఈ దీప జ్వాలలు అధోగతికి ప్రయాణమైనప్పుడు యిది అజ్ఞానమనియు, రాక్షస జీవితమనియు, దీనికి ప్రబోధిస్తూ వచ్చారు. ఈ దీపమునకు రెండు విధములైన మహత్తరశక్తులు నిరూపిస్తూ వచ్చాయి. తమోగుణమైన అజ్ఞానము దూరముగావించటము, దివ్యత్వమైన దైవత్వమునకు ఊర్ధ్వగతి నిరూపించటము ఈ జ్యోతి యొక్క ప్రధాన లక్షణమని నిరూపించింది. అయితే ఈ దీపము భౌతికమైన, లౌకికమైన ప్రాపంచిక సంబంధమైన చీకటిని మాత్రమే దూరము గావించును గానీ అంతర్జ్యోతిని వెలిగించటానికి శక్తి లేదు. హనుమంతుడు సీతాన్వేషణ నిమిత్తమే లంకలో ప్రవేశించి రావణునిపైనున్న క్రోధముచేత లంకకు అగ్గిపెట్టి అర్ధరాత్రి వేళ లంకకు పూర్తి పట్టపగలుగా నున్నట్లు భ్రమింపచేశాడు. లౌకికమైన, ప్రాకృతమైన, ప్రపంచమునకు ఈ లంక పగటివలె కనిపించింది గానీ రావణునియందున్న మనో చీకటి ఏమాత్రము దూరము కాలేదు. ఈ భౌతికమైన జ్యోతులు, లౌకికమైన చీకటిని మాత్రమే దూరము గావించి, మార్గమును నిరూపించుతుంది గానీ, అంతర్ముఖమైన ఆత్మజ్యోతిని వెలిగించి నిజమైన జ్ఞానజ్యోతిని నిరూపించలేదు. రావణుడు సామాన్యుడు కాదు. బ్రహ్మాంశమున జన్మించినవాడు. కుబేరుని అన్న. బలవంతుడైన కుంభకర్ణుని తమ్ముడు. ఇంద్రుని

sri sathyasai vahini amrutam

జయించిన ఇంద్రజిత్ అనే కుమారుడు కల్గినవాడు. ఆరు శాస్త్రములు, నాల్గు వేదములు చక్కగా పఠించి అనేక విధములుగా ఆదర్శము నిరూపించినవాడు. ఇంతటి బలవంతుడు, ఇంతటి విద్యావంతుడు, ఇంతటి శక్తివంతుడు అయిన రావణునియందున్న అజ్ఞానమనే చీకటిని దూరము చేసుకోలేకపోయాడు. మానవుని యొక్క సృష్టి స్థితి లయములకు మూలకారణమైన అజ్ఞానమే ఈ రావణునియందు స్థిరముగా నిలిచింది. ఈ జ్ఞానము అనేది ఉండిన అతనికి పుట్టుక, చావు అనేది లేకుండా ఉండెడిది.

**చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆది మధ్యాంతరహితుండనాదివాడు**
**తాను పుట్టక చావక చంపబడక**
**ఆత్మరూపుడై అంతట వెలసి యుండు.**

అదియే జ్ఞానజ్యోతి. దీనికి చావు పుట్టుకలు లేవు. పునర్జన్మ ఎక్కడా కనిపించదు. ఈ అజ్ఞానముతోనుండిన వానికే పునరపిజననం పునరపి మరణం అయితే అట్టి పునరపిజననం లేనివాడు, పునర్జన్మకు పునాది వేయనివాడు నిజమైన జ్ఞాన స్వరూపుడే. దీపము వెలిగించాలంటే దీనికి నాలుగు పదార్థములు అత్యవసరము. ఆధారమైన ప్రమిద. దీనియందు ప్రేమ అనే తైలము పోయాలి. చిత్తైకాగ్రత అనే వత్తిని పెట్టాలి. తత్వజ్ఞానమనే వెలుగును అందించాలి. ఈ నాలుగు చేరినప్పుడే మానవునియందు జ్ఞానజ్యోతి వికసిస్తుంది. ఈ ప్రమిదయే వైరాగ్యము. ఈ ప్రేమయే తైలము. చిత్తైకాగ్రతే వత్తి. తత్వజ్ఞానమే నిప్పుపెట్టె. ఈ నాలుగు చేరినప్పుడే జ్యోతి వెల్గటానికి అవకాశముంటున్నాది. కనుక మొట్టమొదట ప్రమిద అత్యవసరము. ప్రతి సాధనకు వైరాగ్యము చాలా అవసరము. వైరాగ్యమనగా కేవలం

**ఆలుబిడ్డలు వీడి అడవికేగుట కాదు**
**భావమందు దుష్టభావంబు వీడుటే**
**త్యాగమగును అదియె యోగమగును**

మొట్టమొదట మన భావములు పరిశుద్ధము గావించుకోవాలి. అప్పుడే చిత్తశుద్ధి



sri sathyasai vahini amrutam

చేకూరుతుంది. ఈ చిత్తశుద్ధి ఏర్పడినప్పుడే జ్ఞానసిద్ధి లభ్యమవుతుంది. మొట్టమొదట వైరాగ్యము. వైరాగ్యము అనగా ఎంతవరకు అవసరమో అంతవరకు సంబంధము కల్పించుకోవాలి. సర్వము వీడి ఈ జగత్తులో నివసించు వీలు కాదు. ఎంతవరకు సంచితమో అంతవరకు మనం వైరాగ్యము పూనాలి. అపరిమితమైన వైరాగ్యము ప్రమాదము తెప్పిస్తుంది. పరిమితము లేకపోతే ప్రమాదము చేకూరుస్తుంది. కనుక మానవజీవితమును సమతత్వముతో జీవించుటకు ప్రయత్నించాలి. ఒకానొక సమయంలో గోపికలు కృష్ణుని ప్రార్థించారు. 'కృష్ణా! నీవు అనేక అల్లరి పనులు చేస్తున్నావని తల్లి నిన్ను కొట్టటానికి అనేక పర్యాయములు ప్రయత్నం చేసింది. అప్పుడు నీవు ఎక్కడికో పరుగెత్తి దాక్కొటానికి ప్రయత్నం చేస్తూ వచ్చావు. కృష్ణా! తల్లితో నీవు దెబ్బలు తినకుండా మా హృదయమును ఆనంద పరిచే చోటు సరైన చోటు ఒకటి ఉంది. అక్కడ నీవు ప్రవేశిస్తే తల్లికి నీవు కనిపించవు. దెబ్బలకు నీవు గురికావు. మా హృదయాన్ని ప్రకాశింపచేస్తావు. కనుక నీవు దాక్కోటానికి సరైన ప్రదేశము ఒకటుంది. అదే మా హృదయము. మా హృదయము అజ్ఞానాంధకారములో మునిగిపోతున్నాది. ఏవిధమైన ప్రజ్ఞానము మాలో ప్రకటించటం లేదు. కనుక మా హృదయములో ప్రవేశించి, మా హృదయాన్ని ప్రకాశింపచేసి, నీవు ఈవిధమైన సహాయము మాకు చేయాల'న్నారు. కనుకనే భగవంతుడు హృదయవాసి అని శాశ్వతమైన కీర్తినందుకున్నాడు. ఈ ప్రాకృతమైన దీపావళి అంతరార్థము ఏమిటి? నరకాసురుడు అనే రాక్షసుని రాజ్యమునకు ముఖ్యపట్టణము ప్రాగ్జ్యోతిషపురం. ప్రాగ్ అనగా ముందు. జ్యోతి అనగా వెలుగు. ష అనగా మర్చిపోవటం. ప్రాగ్జ్యోతిషపురము అనగా ముందు జ్యోతిని మరచినవారు ఈ ప్రాగ్జ్యోతిష పురములో నివాసము చేస్తారు. ముందు జ్యోతి అనగా ఏమిటి? అదియే ఆత్మజ్యోతి. ఆత్మజ్యోతిని మరచినవారికి ప్రాగ్జ్యోతిష పురములోని వాసము. నరకాసురుడు ఆత్మతత్వాన్ని మరచిపోయి దేహతత్వాన్ని అభివృద్ధిపరచుకొని దేహాత్మభావము పెంచుకొని ఈవిధమైన అంధకారములో కాలమును గడుపుతూ వచ్చాడు. మనము ఆత్మజ్యోతిని పెంచుకోవాలి, ఆత్మాభిమానము పెంచుకోవాలి గానీ, దేహాభిమానమును కాదు. ఈ దేహాభిమానమే అనేక కష్టములకు, నష్టములకు, దుఃఖములకు గురిచేస్తున్నది. అనేక అనర్థములకు మూలకారనము ఈ దేహాభిమానమే.

sri sathyasai vachanamrutam

నరక-అసురుడు. ఇతడు రాక్షసుడు. తమోగుణము చేత చేరినవాడు కనుక నరకుడు అని పేరు. అధోగతికి ప్రయాణము సల్పేవాడే నరకుడు. ఊర్ధ్వగతిని ప్రయాణము చేసేవాడు నరుడు. జ్యోతిని మనం ఊర్ధ్వగతిగా ప్రజ్వలింపచేసుకోవాలి. మన జీవనజ్యోతిని ఊర్ధ్వగతిగా మనం పెంచుకోవాలి. అదియే ఉత్తమమైన భావములు, పవిత్రమైన చర్యలు నిశ్చలమైన చిత్తముతో అభివృద్ధిపరచుకోవాలి. అపవిత్రమైన చర్యలచేత అసహ్యమైన చర్యలచేత, మనయొక్క దృష్టి అధోగతికి పోతున్నాది. ఇటువంటి దుశ్చర్యలలో పాల్గొన్న దుర్మార్గులను భగవంతుడు కూడా సంహరించటానికి ప్రయత్నించడు. అట్టి మానవుని కూడా భగవంతుడు శిక్షించుటకు ఒప్పుకోడు. వానిపైన దయనా? ప్రేమా? లేక అనుగ్రహమా? కాదు కాదు. వానిని సమీపించటానికి కూడా భగవంతుడు అంగీకరించడు. కనుక వాని శక్తి సామర్థ్యములు క్రమక్రమేణ సన్నగింపచేయటానికి ఒకవిధమైన master plan వేశాడు. ఆ నరకాసురుని దేహపుష్టి చాలా గొప్పది. మానసిక శక్తి కూడా చాలా గొప్పది. శరీర, మానసిక శక్తులను పురస్కరించుకొని దానిని క్రమక్రమేణా సన్నగింప జేయాలని సంకల్పించాడు. ఈ శరీర మనో శక్తులన్నీ సన్నగించటానికి మూలకారణము ఏమిటి? క్రోధమే దీనికి మూలకారణము. మానవుడు ఎంత బలవంతుడైనా క్రోధాన్ని మితి మీరి అనుభవిస్తూ పోయినప్పుడు దేహపుష్టి తగ్గి పోతుంది. మానవునికి ఒక్క పర్యాయం క్రోధం వచ్చిందా మూడు నెలలు భుజించిన శక్తి అంతా క్షీణించిపోతుంది. ప్రతి పర్యాయము నరకాసురునిపై క్రిష్ణుడు యుద్ధమునకు పోవటం, తిరిగి అతను తరుముకొని వచ్చినట్లుగా రావటం, తిరిగి వెనక్కు రావటం చేస్తు ఉండేవాడు కృష్ణుడు. క్రోధాన్ని తెప్పించి అతని శరీర శక్తిని పూర్తిగా హతమార్చాలని సంకల్పించుకున్నాడు కృష్ణుడు. ఈవిధంగా అతని క్రోధముచేత అతని శక్తినంతా పూర్తి హతము చేసుకున్నప్పుడు బలహీనుడైనపుడు తాను కూడా చంపకుండా ప్రకృతి ధర్మము ప్రకారము స్త్రీలను బాధ పెట్టినన వానిని స్త్రీతోనే చంపించాలి కనుక, సత్యభామను తీసుకొనిపోయి ఆమె చేత చంపించాడు. ఈ విధమైన సంహారమునకు భగవంతుడు కొన్ని master plans వేస్తాడు. సంరక్షించటానికి కూడా master plan వేస్తాడు. అన్నింటికిని ఒక master plan ఉంటుంది. ఎందుకంటే తానే master. కనుక master the mind be a master mind అని. తాను master గా ఉండి

sri sathyasai vahini.org

master mind తో జీవిస్తూ వచ్చాడు. ఈ నరకాసురుడు అనేక పాపములతో తన జీవితము గడుపుతూ వచ్చాడు. స్త్రీలను బంధించి చాలా బాధిస్తూ వచ్చాడు. బంధువులందరు ఎంత ఏడ్చినప్పటికిని వారి మొరలు వినలేదు. వారే పదహారు వేలమంది గోపికలు. అతనిని స్వాధీనములో ఉండి హీనపరిస్థితిలోపల జీవితాన్నే ఒక విరక్తిగా భావించుకున్నవారు గోపికలు. జీవితముపైన ఒక విధమైన విరక్తిని పొందారు. వారికి చావటానికి లేదు, బ్రతకటానికి లేదు. ఈ చావు బ్రతుకుల మధ్య జీవితాన్ని అనుభవిస్తూ వచ్చారు. నరకాసురుని సంహరించిన తరువాత వీరందరికి ఆనందము కలిగింది. ఎంతమంది స్త్రీలను సంహరించేవాడో, హతమార్చేవాడో, బాధపెట్టేవాడో అని వారిలో వారు విచారించారు. వారందరిని కృష్ణుడు దగ్గరకు పిలిచి యింక మీమీ స్థానాలకు వెళ్లండి మీ బంధననుండి విమోచన చేశాను. మీరు సుఖముగా శాంతిగా జీవించండి అని బోధించాడు. అప్పుడు గోపికలు చెప్పారు. 'స్వామీ! ఇంతకాలము ఈ నరకాసురుని స్వాధీనములో నుండి మేము తిరిగి మా బంధువుల దగ్గరకు వెళ్లి ఏరీతిగా జీవించాలి? మర్యాదలేని జీవితముగా గడిచిపోతుంది. మా గౌరవ మర్యాదలు మంటగలసిపోతాయి. మీరే మమ్మల్ని రక్షించండి. మీ దగ్గరే ఉంచుకోండి' అన్నారు. 16 వేలమంది గోపికలు కృష్ణునికి అర్పితమైపోయి అతని పోషణలో చేరినవారు కనుకనే గోపికలు 16వేలమంది అన్నారు. అప్పుడే గోపికలు చెప్పారు.

**వాచామగోచరుండని నీ చరితములు పొగడ బ్రహ్మాదులకు నైనతరమా**
**హే కృష్ణా! కాచుకున్నాను నీ కృపకై నా మొర ఆలకించి బ్రోవుమయా**
**కాలుడుగొనిపోయిన గురుపుత్రుని తెచ్చి యిచ్చినావు**
**కాముని మదమడచినావు వసుదేవ దేవకీ చెర విడిపించినావు**
**వెలుగొంటియైన ఆ ద్రౌపతి హా! కృష్ణాయని మొరలిడ**
**బ్రోచినావు మేలు మేలు పాండవులను గాచినావు**
**కుచేలుని ఆర్తి తీర్చినావు**
**కురూపియైన కుబ్జావక్రములను పోగొట్టినావు**
**పదహారువేల రమామణులను చెర విడిపించినావు. ॥వాచా॥**

srisathyasaivachanamrutam

నిన్ను వాక్కుచేత గానీ, మనస్సుచేత వర్ణించుటకు వీలుకాదు కృష్ణా! కనుక ప్రతి మానవుని అజ్ఞానము అనేది అనేక విధములైన పెడమార్గములు పట్టి జీవితాన్ని హింసింపచేస్తుంది. మన అంతర్ముఖమైన ప్రకాశాన్ని మనం పెంచుకోవటానికి ప్రయత్నించాలి. బాహ్యమైన ప్రాకృతమైన ఈ వెలుతురును అభివృద్ధి పరచుకొని ప్రయోజనం లేదు. దృశ్య కల్పితమైన జగత్తును మనం చూడగలమేగానీ అదృశ్యమైన ఆత్మతత్వాన్ని మనం చూడలేము. మానవుడు ఎట్టివాడు. దృశ్యమునకు, అదృశ్యమునకు మధ్య సేతువు వంటివాడు మానవుడు. మనము గోచరమైన దానిని శాశ్వతమైనదిగా విశ్వసించరాదు. **"యద్దృశ్యం తన్నశ్యం"**. చూచినవన్నీ మార్పు చెందేవే. ఈ దృశ్య కల్పితమైన జగత్తుకాకుండా అదృశ్యమైన జ్ఞానతత్వాన్ని అనుగ్రహించమని కోరారు. ఈవిధముగా నరకాసురునిచే అనేక బాధలు పడుతున్న వ్యక్తులు నరకాసురుని సంహారము తరువాత అందరు ఉత్సాహముతో పండుగలు చేసుకుంటూ వచ్చారు. ఇంతకాలము చీకటి యందుంటుండి అంతర్ చీకటి, బహిర్ చీకటి రెండింటియందు మునిగిపోయి మానవత్వాన్నే అర్థము చేసుకొనలేక, దివ్యత్వమును వరించుకొనలేక దైవత్వాన్ని చూడలేక, అంధులై, అజ్ఞానులై, కూలిపోతూ వచ్చారు. అలాంటి వారికి ఈ విధమైన నరకాసుర సంహారము చాలా ఆనందాన్ని చేకూర్చింది.

**ఆకొన్న వానికి ఆకలి తీరునే**
**పంచభక్ష్యముల పేర్లు విన్న**
**నిరుపేద వాని పేదరికంబు పోవునే**
**విత్త ప్రభావంబు విన్నయంత**
**రోగపీడితునిబల్ రోగాలు పోవునా**
**ఔషధ మహిమలంత విన్న**

కేవలం శ్రవణం చేసినంత మాత్రమున బాధలు సంహారము కావు. అనుభవించినప్పుడే ఆ ఆనందము నిత్యానందముగా రూపొందుతుంది. ఎన్నో విధములుగా బాధపడుతున్న గోపికలు, ఈ మానవులు ఈ ఆనందాన్ని అనుభవించి గొప్ప పండుగగా చేసుకుంటూ వచ్చారు. జ్యోతిని వెలిగించటములో ఒక ముఖ్యాంశము ఉంటున్నది. అనేక జ్యోతులంతా

sri sathyasai vachanamrutam

ఉంటాయి. ఒక్క జ్యోతి తీసుకుపోయి అనేక జ్యోతులను అంటిస్తుంటాము. ఇక్కడ అంటించేది ఒకే (జ్యోతి) candle. అటించబడేవి అనేక జ్యోతులు. అంటించే జ్యోతి పరంజ్యోతి. అంటింపబడే జ్యోతులు జీవన జ్యోతులు. అనేక జీవన జ్యోతులను ఒక్క పరంజ్యోతి మాత్రమే అంటిస్తూ ఉంటుంది. దీనిని ప్రపంచానికి సత్యముగా బోధ చేసేనిమిత్తమై ఈనాడు జ్యోతులంతా అమితంగా వెలిగిస్తుంటారు. ఈ ఆనందోత్సాహములచేత ఈ మతాబులు కాలుస్తుంటారు. కాల్చుటకు మూలకారణం ఏమిటి? ఈ నరకాసుర సంహార ఫలితంగా పటాసులు కాలుస్తుంటారు. ఈవిధమైన అంతరార్థముతో కూడిన భారతీయుల పర్వదినములు ఒక్కొక్క పర్వదినమునందు ఒక్కొక్క అంతరార్థమును ప్రబోధిస్తూ వచ్చింది. ఈనాడు తెల్లవారి లేచిన తక్షణమే స్నానం చేయటం, నూతన వస్త్రములు ధరించటం, ఇల్లు వాకిళ్లు పరిశుద్ధము చేసుకోటం, పచ్చని తోరణములు కట్టటము ఇవి మన భారతీయ సాంప్రదాయము. అంతర్ బహిర్ శుద్ధి – చిత్త శుద్ధి నిమిత్తమై ఈవిధముగా శిరస్నానము చేయటము, కొత్త బట్టలు వేసుకోటం అనగా ఏమిటి? పాతవి కాదు, రోతవి కాదు. నూతన వస్త్రములు. మన జీవితము నిత్యనూతనముగా విశ్వసించాలనే ఉద్దేశ్యముతో ఈ పండుగలు ప్రారంభ మయ్యాయి. మన గృహమును పరిశుద్ధము చేసుకోటం అంతఃశుద్ధికి చిహ్నము. దీనినే వేదమందు 'అంతర్‌బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః' లోపల వెలుపల పరిశుద్ధముగా ఉండాలి. పరిశుద్ధమైన దానికోసమై నామస్మరణ చేసుకోటం. బయట శుద్ధి నీరు చేస్తుంది. ప్రేమ అంతరముఖమైన హృదయాన్ని పరిశుద్ధము చేస్తుంది. మనకు చిత్తశుద్ధి కావాలంటే ప్రేమ అనే నీరు కావాలి. ఈవిధంగా పవిత్రమైన పర్వదినములందు ఈ పవిత్ర అంతరార్థములను అనుభవిస్తూ ఆనందిస్తూ భగవచ్చింతనచేత కాలాన్ని సార్థకము గావించుకోవాలి. మానవుని ఇన్ని కష్టములకు, నష్టములకు, దుఃఖములకు మూలకారణమేమిటి? మానసిక అశుద్ధమే దీనికి మూలకారణము. మానసిక సంబంధమైన మాలిన్యము, మానవునికి ఈవిధమైన కష్టములకు, నష్టములకు, దుఃఖములకు గురిచేస్తున్నది. కేవలం ప్రపంచం మనకీ కష్టములందిస్తున్నాదని నెపం వేయకూడదు. మనమే ప్రపంచానికి బాధలు పెడుతున్నాం. ఈ కష్టములకు, నష్టములకు మనిషే మూల కారణము. మానవునికి పరిశుద్ధమైన

sri sathyasai vahanamrutam

హృదయం లేకపోవటంచేత, యింత అశాంతికి గురిచేస్తున్నాడు ప్రపంచాన్ని. యద్భావం తద్భవతి. మానవునిది పరిశుద్ధమైన హృదయంగా ఉండినప్పుడు ప్రపంచమంతా పరిశుద్ధముగానే ఉంటుంది. మొట్టమొదట చిత్తశుద్ధి అత్యవసరము. ఈ చిత్తశుద్ధి మనలో అభివృద్ధి అయినప్పుడు జ్ఞానశుద్ధి మనకు లభ్యమవుతుంది. ఈ జ్ఞానమే లేకుండిన అజ్ఞానమనే అంధకారములో మునిగి మరింత అశాంతిగా రూపొందుతాము. ఈ సమస్త దుఃఖములకు అజ్ఞానము మూలకారణము. అజ్ఞానమంటే ఏమిటి? మనకు తెలియని తత్వము. మనకు తెలియని తత్వమును మనం తెలుసుకోటానికి ప్రయత్నించాలి. ఆ తెలుసుకోటానికి ప్రయత్నించటమే సాధనలు. సాధనల చేతనే మనకు సాధ్యము చేకూరుతుంది. సాధనలు లేక సాధ్యమే చేకూరదు. సాధనమున పనులు సమకూరు ధరలోన. చిన్న చీమైనా నడచుటకు ప్రయత్నించినప్పుడు కొన్ని వందల మైళ్ళు ప్రయాణం చేస్తుంది. ప్రయత్నం చేయకుండిన రెక్కలుండి కూడను పక్షి ఒక్క యించైనా ముందుకు పోలేదు. మానవునికి ప్రయత్నం చాలా అవసరం. తాను ప్రయత్నం చేస్తే ఎంతైనా సాధించగలడు. కానీ మానవుడు ఈనాడు అనేక ప్రయత్నముల చేత, ధనము వ్యయంచేత చంద్రమండలానికి వెడుతున్నారు. లక్షలమైళ్లు అంతరిక్షయానం చేస్తున్నాడే గానీ అరయించి ఏమైనా హృదయాంత రాళమునకు పోతున్నాడా? ఒక్క అరయించి కూడా లోపలకు పోవటం లేదు. ఈ లక్షలమైళ్లు ఏవిధంగా పోగల్గుతున్నాడు. ఇది బాహ్యమైన యంత్రం ఆధారంతో పోతున్నాడు. కానీ ఈ యంత్రము మనకు అక్కరలేదు. మంత్రమే మనకు చాలు. ఎంతవరకునైనా పనిచేస్తుంది. హిరణ్యకశిపుడు యంత్రములచేత నక్షత్రమండలమునకు పోయాడు కానీ ఈనాటి సైంటిస్టులు కేవలం చంద్రమండలం వరకు మాత్రమే వెళ్లారు. ఆనాడు హిరణ్యకశిపుడు నక్షత్రమండలము వరకు పోయాడు. అంతవరకు పోయి ప్రయోజనం ఏమిటి? అంతవరకు పోయి కూడను ఏమీ సాధించలేకపోయాడు. కానీ అలాంటి అగోచరమైన, అప్రమాణమైన, అనంతమైన దివ్యత్వాన్ని హస్తగతము గావించుకున్నవాడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుని శక్తి మంత్రమయము. హిరణ్యకశిపుని శక్తి యంత్రమయము. యంత్రమయమైనది ఏనాటికైనా failure కావచ్చును. కానీ మంత్రము ఏనాటికి fail కాదు. 'మననత్రాణసమ్మిళితం యితిమంతః'

srisathyasaivachanamrutam

అన్నారు. మానవశక్తి, దానిని లోపల భద్రము చేసుకునే శక్తి ఈ రెండు ఉండినప్పుడే అదే నిజమైన మంత్రశక్తి. ప్రాచీనకాలమునుండి ఈ పవిత్ర భారతదేశము ఆధ్యాత్మిక సంపత్తిచేత అన్ని దేశములకు సుస్థిర శాంతి భద్రతలు చేకూరుస్తూ వచ్చింది. తరములు మారినా, యుగములు కదలినా, దివ్యత్వమైన ఆత్మతత్వము నిశ్చలంగా నిర్మలంగానే ఉంటుంది. కనుక యిట్టి పవిత్రమైన భారతదేశమందు జన్మించిన భారతీయులు, ఈ దివ్యమైన తత్వాన్ని గుర్తించుకో లేకపోతున్నారు. ఈ దివ్యత్వము మానవునియందే అమితముగా ఉంటున్నాది. కనుక యంత్ర మంత్ర తంత్రములు ఒక్క మానవ స్వరూపమునందే ఇమిడి ఉంటున్నాయి. నిరంతరము మనము ఒక మంత్రమును ఉచ్ఛరిస్తూనే ఉన్నాము. అదియే సో-హం. ఇంతకంటె గొప్ప మంత్రము మరొకటి లేదు. సోహం I am God. I am God. 24 గంటలలో 21,600 పర్యాయములు ఉచ్చరిస్తున్నాము. ఈవిధమైన మంత్రమును ఉచ్ఛరిస్తుంది, యంత్రము అదే దేహము. ఈ గుండెలోని రక్తము ఎవరు పంపుకొడుతున్నారు? మానవుడు భుజించిన ఆహారము ఎవరు జీర్ణింపచేస్తున్నారు? ఈ రక్తమును heart కు చేర్చి, పరిశుద్ధము చేసి దేహానికి ఎవరు అందింపచేస్తున్నారు. మానవుని దేహములోని blood దేహమంతా సంచరించుటకు ఎవరు ప్రయత్నం చేస్తున్నారు. ఇవన్నీ యంత్రము వలె ఉంటున్నాయి మనకు. దేహమే ఒక యంత్రము. దేహములోని సర్వాంగములు సమస్త కార్యములు చేస్తున్నాయి. ఒక ఇంచి కూడా లేదు కన్ను. ఈ కన్ను ఎన్ని లక్షలమైళ్లలోనున్న నక్షత్రాల్ని చూడగలుగుతున్నది. ఎంత దూరమైనా నేత్రము చూడగలుగుతున్నాది. ఎంత powerful యంత్రమిది. మన ear drums. ఎవరికి కనిపించకుండా ఉంటున్నాయి. యింత గోప్యంగా ఉంటుంది కూడను. ఎక్కడో జరిగిన విషయాలంతా వింటున్నాది. ఈ టెలివిజన్లు, టెలిఫోన్లు అన్నీ మన యంత్రమైన దేహమందే ఉంటున్నాయి. ఇలాంటి యంత్రాన్ని మనం ధరించి, ఇలాంటి పవిత్ర మంత్రాన్ని వరించి ఈ జీవితాన్ని ఏమాత్రం సార్థకం చేసుకోకుండా ఉన్నామంటే ఎంత అవమానం. ఇంక హృదయం. అదియే తంత్రం. హృదయము తంత్రము, దేహము యంత్రము, శ్వాస మంత్రము. ఈ యంత్ర మంత్ర తంత్రములతో కూడిన మానవుడు యింక ఎక్కడికో మంత్రాలకోసం వెడుతున్నాడు. ఎవరి దగ్గరో మంత్రాలు తీసుకోటానికి ప్రయత్నం

sri sathyasai vahini amrutam

చేస్తున్నాడు. ఎందుకు ఉపదేశము? సోహం - అదే మనకు చాలు. మననుండియే మనం బోధ చేసుకోవాలి. మానవుడు యింకొకరి దగ్గరకు పోనక్కరలేదు. సర్వము తనయందే ఉంటున్నాది. మానవుని కంటె మించిన యంత్రము మరొకటి కానరాదు. అలాంటి పవిత్రమైన మానవజన్మ ఎత్తికూడను దుర్లభం మానుషజన్మః అన్నారు. మానవునిలో ఎన్నో పవిత్రమైన అంశాలు ఉంటాయి. ఈ యంత్రములో 5 కోశములుంటున్నాయి. అవి అన్నమయము, ప్రాణమయము, మనోమయము, విజ్ఞానమయము, ఆనంద మయము. ఈ పంచకోశములలో అన్నమయకోశముగా ఉంటున్నాది దేహము. దీనికంటె సూక్ష్మమైనది ప్రాణమయము. దానికంటే అతి సూక్ష్మమైనది మనోమయము. సూక్ష్మమైన దేహానికి పోయేటప్పటికి అక్కడ విజ్ఞానమయము. ఈనాటి మానవులందరు మనోమయం వరకు ప్రయాణం చేస్తున్నారు గానీ విజ్ఞానమయం వరకు పోలేదు. ఎప్పుడు విజ్ఞానమయమును అందుకుంటాడో, అనుభవిస్తాడో అప్పుడే ఆనందమయము అందుతుంది. ఎందుకోసం **"జంతూనాం నరజన్మ దుర్లభం"** అన్నారు. మానవుని యందు ఈ ప్రజ్ఞానము ఉంటున్నది. ఆనందమయము ఉంటున్నాది. యింతే కాదు. మానవునియందు యింకా అమితమైన శక్తులుంటున్నాయి. ఈ శక్తులను ఏమాత్రం పరిశీలన చేయటానికి సాధ్యం కాదు. మనం విజ్ఞానమయం వరకు చేరితిమా, ఆనందమయం మన హస్తగతమైపోతుంది. ఈ ఆనందమయకోశము నుండి పవిత్రమైన అద్వైతానందం. ఏమిటీ అద్వైతానందం. ఏకం ఏవ అద్వితీయం బ్రహ్మ. రెండు కానిది ఒక్కటే. అదియే మనకు ఆత్మతత్వము. అది ఒక్కటే. నా ఆత్మ, నీ ఆత్మ, వాని ఆత్మ అని ఆత్మలు ప్రత్యేకం లేవు. ఈ దేహమనే బల్బులు వేరువేరుగా ఉంటున్నాయి. కానీ కరెంటు ఒక్కటే. ఒక బల్బు dim గా ఉండవచ్చు, ఒక బల్బు bright గా ఉండవచ్చు. Dim, bright బల్బుల వ్యత్యాసమే గానీ కరెంటు వ్యత్యాసము కాదు. అదేవిధముగా ఆత్మసర్వులయందు ఉంటున్నది. ఏకాత్మా సర్వభూతాంతరాత్మ. అందరియందున్న ఆత్మ ఒక్కటే. ఇలాంటి ఏకత్వాన్ని బోధించినదే భారతీయ సంస్కృతి. ప్రాచీనకాలము నందు అనేకత్వములోనున్న ఏకత్వమును నిరూపిస్తూ వచ్చారు. కానీ దురదృష్టవశాత్తు ఈనాడు ఆధునికయుగమందు ఏకత్వాన్ని అనేకత్వంగా విభజిస్తూ పోతున్నారు. అదే పొరపాటు. ఈ పొరపాటు పడటంచేతనే దుఃఖములకు గురౌతున్నారు.

sri sathyasaivachanamrutam

Nations are many, but earth is one
Beings are many, but breath is one
Stars are many, but sky is one
Jewels are many, but gold is one

ఈ సత్యాన్ని మనం గుర్తించుకుంటే దైవత్వములోని ఏకత్వము మనకు అర్థమవు తుంది. ప్రతి దేశీయులు కానీ ఎవరైనా దేశకాల పరిస్థితుల ప్రభావమునకు ఏమాత్రము గురికాకుండా ఏకత్వాన్ని గుర్తించుటకు ప్రయత్నించాలి. ఎవరిని మనం ద్వేషించనక్కరలేదు. నీయొక్క క్రోధాన్ని నీవు ద్వేషించు. నీ దుర్గుణములతో నీవు fight చేయి. అంతేగానీ యితరులతో నీవు fight చేయనక్కరలేదు. నీ దుర్గుణములు నీవు దూరము గావించుకో. ఎప్పుడు దుర్గుణములు దూరం గావించుకోటానికి వీలవుతుంది? దైవానికి అర్పితము అయినప్పుడు దుర్గుణాలు అంతర్గతమై పోతాయి. ఒక చిన్న ఉదాహరణ. భగవంతుడు 16 సం॥ల ఆయువుతో సత్పుత్రుడుగా పుట్టింపచేశాడు. ఎవరిని? మార్కండేయుడిని. మృకండుని కుమారుడు మార్కండేయుడు. అతను నిత్యము ఈశ్వరుని జపిస్తూ, పూజిస్తూ వచ్చాడు. కానీ యితనికి ఈ రహస్యము ఏమీ తెలియదు. 16 సం॥ నిండిపోతున్నాదని తల్లిదండ్రులు ఏడ్చుకుంటూ కూర్చున్నారు యింటిలో. ఇంటికి వెళ్లి ఈ కన్నీరు కార్చటానికి కారణం ఏమిటి? అని అడిగాడు. 'నాయనా! నీ కాలం పరిపూర్ణమై పోతున్నాది. నీవు దేహాన్ని వదలిపెట్టి పోవలసివస్తుంది. ఎట్లా జీవించేది మేము' అన్నారు. 'అమ్మా! ఈ ఉన్న కొద్ది కాలము నేను దుర్వినియోగం చేయను. నేను దేహము శ్వాస వదిలేవరకు శివుని దగ్గరే ఉండిపోతానని శివదేవాలయమునకు వెళ్లి శివుని కౌగలించుకున్నాడు. లింగముపై తలపెట్టుకొని ధ్యానము చేస్తూ కూర్చున్నాడు. కాలుడు వచ్చాడు. పాశము విసిరాడు. ఈ త్రాడు వేసేటప్పటికి, ఈశ్వరుడు, మార్కండేయుడు యిద్దరు ఏకమై ఉన్నారు అక్కడ. మార్కండేయునకు ప్రత్యేకంగా విసరటానికి వీలులేదు. ఈ పాశము ఈశ్వరునికి కూడా పడిపోయింది. అప్పుడు ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. యముని భస్మం చేశాడు. అనగా ఏమి? భగవంతునితో ఏకత్వము పొందిన తరువాత యింక seperation అనేది ఎక్కడా లేనేలేదు. కనుక ఏకత్వములో మన జీవతత్వమును

srisathyasaivachanamrutam

అర్థం చేసుకోటానికి ప్రయత్నం చేయాలి. ఆ union ఎట్లా వస్తుంది. మొన్న చెప్పాను. బొగ్గు ఒకచోట, నిప్పు ఒకచోట పెడితే నిప్పురాదు. బొగ్గును నిప్పుకు సమీపంగా తీసుకొని పోవాలి. సమీపముగా తీసుకునిపోయిన తరువాత భగవంతుని ప్రేమ అతని యందు ఆవిర్భవిస్తుంది. ఆ ప్రేమయే గాలి. కాబట్టి near and dear రెండు చేరేటప్పటికి బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. యిద్దరు ఒక్కటైపోతారు. ఏ సాధనలు అవసరము లేదు. పరిపూర్ణమైన నిర్మలమైన ప్రేమ ఒక్కటి ఉంటే చాలు. ఈ ప్రాకృత సాధనలు చేసి ప్రయోజనం ఉండదు. ఇవన్నీ లౌకికమైన, ప్రాకృతమైన జీవితాన్ని గడుపుకొనే నిమిత్తం కాలమును సార్థకము చేసుకునే నిమిత్తమే సాధనలు చేస్తున్నాము గానీ కాలస్వరూపుడైనప్పుడు కాలానికి సార్థకము ఎక్కడుంది? Time is God. Don't waste time. Time waste is life waste. Be happy. ఎప్పుడు time ని సార్థకం చేసుకో. ఇదియే పెద్ద సాధన. ఈవిధమైన పర్వదినముల అంతరార్థమును ప్రబోధిస్తూ వచ్చింది మన ప్రాచీన భారతీయ సంస్కృతి. కానీ ఈ సంస్కృతికి తగిన సంస్కారము అత్యవసరము. ఈ culture వేరు. సంస్కారము వేరు. ఈ రెండింటి ఏకత్వమునకు సరైన హృదయాన్ని పెంచుకోవాలి. మన హృదయం చాలా చిన్నది కాదు. ఇది చాలా పెద్దది. నీ హృదయం విశాలమైనది. సముద్రము ఎంత ఉంటున్నాదో అంత విశాలమైనది నీ హృదయము. నీ హృదయాన్ని విశాలం గావించుకో. Narrow mind గా నీవు ఉండవద్దు. Expansion love is life. Contraction love is death. సంకుచితముగా జీవించకూడదు. విశాలమైన ప్రేమతో జీవించాలి. ఆ విశాల హృదయం ఎక్కడ ప్రాప్తిస్తుంది? దైవము నుండే ప్రాప్తిస్తుంది? దైవప్రేమచేత ఏమైనా యివ్వగలడు. తాను యివ్వనిది ఏదీ లేదు తన దగ్గర. సర్వమూ యివ్వగలడు. తనను తానే యిచ్చుకునే భగవంతుడు యింక యివ్వలేనిదేమిటి. సర్వము యిస్తాడు. అడిగితే యిస్తాడు. తడితే తెరుస్తాడు. కానీ అడగటం లేదు. తలుపు తట్టం లేదు. పేరు చెప్పటం లేదు. తప్పక పేరు పిలుపు. భగవంతుడా! భగవంతుడా! అని పిలు. కానీ యీనాడు పిలుస్తున్నాడు. ఎవరిని పిలుస్తున్నాడు? భూతములను పిలుస్తున్నాడు. పిశాచులను పిలుస్తున్నాడు. తలుపులు తడుతున్నాడు. నరక ద్వారములు తడుతున్నాడు. స్వర్గద్వారములు కాదు. మోహక్షయమే మోక్షం. అదియే మనకు మోక్షం. మోక్షమంటే ప్రత్యేకించిన ప్రదేశము కాదు. మన మోహాన్ని

sri sathyasai vacharamrutam

క్రమక్రమేణా తగ్గించుకోటమే మోక్షము. ఈ మోహాన్ని తగ్గించుకునే నిమిత్తము వైరాగ్యము చాలా అవసరము. అదియే container. దానిలో ప్రేమ అనే oil పోయాలి. చిత్తైకాగ్రత అనే వత్తిని పెట్టవచ్చును. అప్పుడు తత్వజ్ఞానమనే నిప్పుతో దానిని అంటించవచ్చును. ఇవి రెండు అయ్యేటప్పటికి oil అయిపోతుంది, వత్తి ఉండదు. దీన్నే భద్రాచల రామదాసు చెప్పాడు.

**సారమైనది చమురురా సత్యమైనది వత్తిరా**
**వెలుగు తీరి పోయేటప్పుడు వెంట ఎవ్వరు రారు రా**
**పాటువైనది చెట్టురా పట్టువైనది కొమ్మరా**
**పాటు దప్పి పట్టు విడిచితే పరబ్రహ్మము చేరురా**

ఈ ప్రకృతి దీనికోసమై మనం ఆధారపడుతున్నాము. ప్రకృతి మనకు ఆధారము కాదు. ప్రకృతికి మరొక ఆధారము ఉంటున్నాది అదే దైవత్వము. నేను మొట్టమొదట మన యూనివర్సిటీ ప్రారంభమైనప్పుడు ఈ Chemistry, Physics, Botony యివన్నీ subjects ఉన్నాయి. అన్నీ subjects కంటే ఆధారమైనది chemistry. అదే liquid. ఈ liquid క్రింద ఉండాలంటే ఏదైనా పాత్ర ఉండాలి కదా. అదే రసాయన శాస్త్రము. ఉష్ణశక్తి అధికంగా ఉండటం చేత liquid గా ఉంటున్నాది. అది క్రమక్రమేణా పైకి వచ్చేటప్పటికి గాలి వాతావరణము చేత, ఘనీభవించినట్లుగా అవుతుంది. అదియే Physics. దీనిపై కొన్ని insects వాలుతుంటాయి. వీటివల్ల జీవులు ప్రారంభమైపోతాయి. అదియే జువాలజీ, బోటనీ. అన్నింటికి మూలకారణము Chemistry. ఆ liquid కి ఒక ఆధారము ఉంటున్నాది. అదే దైవత్వమనే పాత్ర. ఆ పాత్ర లేక ఏ liquid ఉండుటకు వీలుకాదు. కాబట్టి ప్రతి దానికి ఆధారము దైవమే. అతనికంటె మించిన ఆధారము మరొకటి లేదు. దైవాన్ని ఆధారం చేసుకుంటే అన్నీ మనకు సులభంగా నెరవేరుతాయి. కానీ ఈనాటి మానవుడు తన తెలివితేటలను, తన మేధాశక్తిని పురస్కరించుకొని అనవసరమైన కార్యక్రమాలలో ప్రవేశిస్తున్నాడు. ఈ విధమైన ప్రయత్నములు ఎన్ని సంవత్సరములు చేసిన ప్రయోజనముండదు. కనుక పదార్థమును మొట్టమొదట త్యజించు. పరార్థములో ప్రవేశించు. యదార్థము అర్థమవుతుంది. ఈనాడు యదార్థమే మూల పడిపోతున్నది. కారణం ఏమిటి? పదార్థముపై ఆధారపడ్డావు. ఈ పదార్థములపై ఉండటం చేత

srisathyasaivachanamrutam

పరార్ధమును మర్చిపోతున్నావు. ప్రపంచములో అన్నింటికంటె విలువైన పదార్థము ఒక్కటే. అదే మన జీవితము. అదే తమసోమా జ్యోతిర్గమయ. ఎప్పుడు యీ తమస్సునుండి జ్యోతిలోకి వచ్చామో మృత్యోర్మా అమృతంగమయ. అదే అమృతత్వము. ఆ అమృతత్వము ఎట్లా మీకు ప్రాప్తిస్తుంది? Removal of immorality is the only way to immortality. మీలో దుర్గుణాలంతా ఉంటున్నాయి. ఈ దుర్గుణాలు దూరం చేసుకోవాలి. ఈ కామ, క్రోధ, లోభములనే అరిషడ్వర్గములంతా దేహమునుండి ఆవిర్భవించినవే. పవిత్రమైన మానవతా విలువలంతా హృదయము నుండి వచ్చేవి. ఒకటి తల, రెండవది హృదయము. Head only responsibility. Heart right. కాబట్టి right తో నీవు fight చేయి. అది నీ జీవితము యొక్క ఆధారము. ఆ హృదయములో భగవంతుని ప్రవేశపెట్టుకో. అన్నీ నీకు పరిహారమవుతుంది. చెప్పినట్లు వినండి. చెప్పినది విననప్పుడు చాలా ప్రమాదము వస్తుంది.

**మంచిమాట వినరు మనసిచ్చి చెప్పిన**
**చెడ్డ మాటలంత చెవికి చేర్చు**
**ఇట్టివారు నన్ను ఎరుంగ నేర్తురా**
**ఎట్టి చదువుండి ఏమి ప్రయోజనం.**

రావణుడు 64 విద్యలు చదివాడు. చదివి ఏమి ప్రయోజనం. కానీ అనుగ్రహానికి పాత్రుడు కాలేదు. ఇదంతా భౌతిక విద్యలతో చేరిపోయింది. ఎక్కువ విద్యలు చదవటం వల్ల అజీర్ణరోగం బయలుదేరింది. ఆ అజీర్ణరోగం రావటం చేత అనారోగ్యానికి గురయ్యాడు. అవియే విషయవాసనలు. అవే 64 విద్యలు రామచంద్రుడు కూడా నేర్చాడు. కానీ రాముడు అన్ని జీర్ణించుకుంటూ ఆచరణలో పెడుతూ వచ్చాడు. అది ఆచరణ. ఇది ఆడంబరము. ఆడంబరములో లేదు, ఆచరణలో ఉంటున్నది ఆనందము. వాల్మీకి రావణుడు మూర్ఖుడన్నాడు. రాముడు దివ్యస్వరూపుడు. కారణం ఏమిటి చదివినవి జీర్ణించుకొని ఆచరణలో పెట్టి సమాజమున కందిస్తూ వచ్చాడు. రామునిది Practical knowledge. రావణునిది bookish knowledge. ఈ bookish knowledge ఏమి ప్రయోజనం. యిది superficial knowledge గా మారిపోతుంది. ప్రయోజనం లేదు. అది Artificial. plastic గులాబి మొక్క తెచ్చి అక్కడ పెట్టండి. ఒక్క తుమ్మెద అయినా వచ్చి చేరదు. ఎందుకంటె అది

srisathyasaivachanamrutam

కల్పితమైనది. కృత్రిమమైనది. నిజమైన గులాబి అక్కడ పెట్టండి. ఒక్కసారి వచ్చి తుమ్మెదలు వాలతాయి. ద్రాక్ష plastic ద్రాక్ష దగ్గర చీమ, దోమ వాలదు. కారణం ఏమిటి. జ్యూస్ లేదు.

**ఫలము లేని వృక్షము వలె**
**రసము లేని ఫలము వలె**
**పుట్టి పెరిగి ఏమి ప్రయోజనం?**
**ఫలమెరుగక పుట్టినావు**
**నీవెవరవొ తెలియకున్న**
**పుట్టి ఫలమేమిటి?**
**తన్ను తాను తెలియుకున్న తత్త్వజ్ఞాన మెట్లు కుదురు?**

నీవు ఎవరో నీవు తెలుసుకుంటే సర్వము తెలుసుకున్న వాడౌతావు. మొట్టమొదట అది తెలుసుకోవాలి. అదియే యీ పర్వదినములంతా బోధించే పవిత్రమైన సూక్తి. దుష్టగుణములు దుష్టతత్వాన్నే అందిస్తాయి. మంచి గుణములు మంచినే అందిస్తాయి కనుక పవిత్రమైన గుణాలు మీరు పెంచుకోవాలి. పవిత్రమైన దైవత్వాన్ని చింతించాలి. ఆ దైవ చింతన వలననే సర్వ చింతలు దూరమైపోతాయి.

**(తేదీ 19-10-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivacharamrutam